## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్, వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం వీధి, బేతపూడి అరుణకుమారి వీధి, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

### మహిళపై దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచిన ఘటన గొల్లపూడి ఎస్ఎస్ఎస్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుట్టా స్వర్ణ అనే మహిళ భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. బేబీ కేర్ యూనిట్‌లో ఎక్కడ పని ఉంటే అక్కడకు వెళుతుంది. రెండేళ్ల కిందట హైదరాబాద్‌లో ఆటోలో వెళ్తుండగా ఏసోబు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. నెల రోజుల క్రితం గొల్లపూడిలో పని ఉందని ఏసోబు ఆమెకు ఫోన్ చేశాడు. దీంతో ఆమె హైదరాబాద్ నుంచి గొల్లపూడికి వచ్చింది. ఏసోబు ఎస్ఎస్ఎస్ కాలనీలో ఆమెను ఒక రూమ్‌లో ఉంచాడు. ఒక రోజు ఇద్దరూ కలిసి అదే రూంలో ఉన్నారు. ఈనెల 3వ తేదీ ఏసోబు, అతని భార్య కోటిరత్నం, కుమారుడు మనోహర్ ఆమె ఉంటున్న గది వద్దకు వచ్చి ఆమెపై దాడి చేసి గాయపరిచారు. అనంతరం 108 సహాయంతో ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై బాధితురాలు పుట్టా స్వర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మద్యం షాపు వద్ద వ్యక్తిపై దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మద్యం మత్తులో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన భవానీపురం స్వాతి సెంటర్‌లోని ఓ వైన్స్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం భవానీపురం ఔట్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కంతేటి రత్నకిశోర్ సితార సెంటర్‌లో వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తూ స్వాతి థియేటర్ సమీపంలోని ఎన్‌హెచ్ 65 పక్కన ఓ వైన్స్‌లో మద్యం సేవించేందుకు వెళ్లాడు. అక్కడ అప్పటికే మద్యం సేవిస్తున్న చావలి గోపాలకృష్ణకు ఇతనికి మధ్య మాటామాట పెరిగి వాగ్వాదం జరిగింది. దీంతో అతను రత్నకిశోర్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేసి, ఛాతీపై బలంగా కొట్టాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించగా కుడి చేతిపై దాడి చేశాడు. రత్నకిశోర్‌ను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై బాధితుడు గురువారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# విద్యాధరపురం డిపోకు మోక్షమెప్పుడు?

- చిన్న వర్షానికే తటాకంలా మారుతున్న డిపో
- రోజుల తరబడి నీరు నిలిచిపోయి ఇబ్బందులు



కొద్దిపాటి వర్షానికి డిపోలో చేరిన వర్షపు నీరు (ఫైల్ ఫొటో)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కొద్దిపాటి వర్షానికే ఏపీఎస్ ఆర్టీసీ విద్యాధరపురం డిపో జలమయమవుతోంది. ఒక రోజు వర్షం కురిస్తే డిపోలోకి వర్షపు నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. డిపో ప్రధాన గేటు నుంచి మెయిన్ రోడ్డు వరకు వర్షపు నీరు నిలుస్తోంది. విధులకు హాజరయ్యేందుకు వచ్చే సిబ్బంది వర్షపు నీటిలోని బైక్‌లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు నిత్యం ఆ నీటిలోనే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. తమ డిపోకు మోక్షమెప్పుడా? అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

**30 ఏళ్ల కిందట ఏర్పాటైన డిపో**

ముప్పై ఏళ్ల కిందట ఏపీఎస్ఆర్టీసీ విద్యాధరపురంలో డిపో ఏర్పాటు చేసింది. అప్పట్లో ఇదొక చెరువు. ప్రస్తుతం డిపోలో 93 బస్సులు ఉన్నాయి. 223 మంది కండక్టర్లు, 216 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు గాక గ్యారేజ్ సిబ్బంది 100 మందికి పైగా ఉన్నారు. బస్సులు నిత్యం వందల ట్రిప్పులు వేస్తుంటాయి. ఏ మాత్రం వర్షం కురిసినా సిబ్బంది డిపోలోకి వెళ్లలేని పరిస్థితి. మోకాలి లోతు వర్షపు నీటిలోనే వెళ్లాల్సి వస్తోంది. ఇక మహిళా సిబ్బంది ఇబ్బందులు అంతా ఇంతా కావు. బైక్‌లపై వచ్చే సిబ్బంది విధులకు వెళుతూ వారి వాహనాలను ఆ నీటిలోనే పార్క్ చేయాల్సిన దుస్థితి. డిపో గొల్లపూడి బైపాస్ రోడ్డు కంటే పల్లంలో ఉంటుంది. గతేడాది వచ్చిన బుడమేరు వరదల్లో డిపోలో భారీగా వరద నీరు చేరింది. బస్సులు కూడా లోపలకు వెళ్లేందుకు అవకాశం లేక అప్పట్లో రోడ్డు పక్కనే పార్క్ చేశారు. నెలల తరబడి వరద నీరు డిపోలో నుంచి బయటకు వెళ్లలేదు. మే నెలలో రెండు మూడు రోజులకోసారి అకాల వర్షాలు కురుస్తున్నాయి. 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతే బస్ డిపో లోకి అడుగు పెట్టలేని పరిస్థితి. మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి చేరుకున్నాయి. వర్షాలు ప్రారంభమైతే డిపో పరిస్థితి అధ్వానంగా ఉంటుంది, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల కింద కురిసిన వర్షపు నీరు కొంత ఇప్పటికీ ప్రధాన గేటు వద్ద నిలిచే ఉంది. వర్షపు నీరు చేరిన ప్రతిసారి పెద్ద మోటార్ సహాయంతో వరద నీటిని బయటకు తోడేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఇదే పరిస్థితి. డిపోను ఎత్తు పెంచితే తప్ప వరద ముప్పు నుంచి మోక్షం లభించదని చెబుతున్నారు.

**రూ.15 కోట్లతో ప్రతిపాదనలు**

రోడ్డు కంటే పల్లంలో ఉన్న డిపో ఎత్తు పెంచేందుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులు ప్రభుత్వానికి పంపారు. విద్యాధరపురం డిపోకు త్వరలో ఎలక్ట్రికల్ బస్‌లు రానున్నాయి. వీటి కోసం డిపోను ఆధునీకరించాల్సి ఉంది. అయితే ఎలక్ట్రికల్ బస్సులను చార్జి చేసేందుకు హెచ్‌టీ లైన్, చార్జర్ల కోసం రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఎత్తు పెంచితే వరద నీటి బెడద తప్పుతుందని, మరో ప్రత్యామ్నాయం లేదని డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు.

## ఏపీ కబడ్డీ సంఘం నుంచి వీర్లంకయ్య, ప్రభాకర్‌ను తొలగించండి

- దుర్వినియోగం చేసిన నిధులను పెనాల్టీతో సహా వసూలు చేయండి
- శాప్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

విజయవాడస్పోర్ట్స్: నిధుల దుర్వినియోగం, నకిలీ క్రీడా సర్టిఫికెట్‌లు మంజూరుకు పాల్పడిన ఏపీ కబడ్డీ అసోసియేషన్(ఏకేఏ) అధ్యక్ష,కార్యదర్శులు కె.ఈ.ప్రభాకర్, వి.వీర్లంకయ్యపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఇరువురిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)కు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘకాలం పాటు ఏకేఏ అధ్యక్ష,కార్యదర్శులుగా పని చేసిన కె.ఈ.ప్రభాకర్, వి.వీర్లంకయ్యలపై పలువురు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన విజిలెన్స్ 2025 మార్చి 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ప్రకారం.. వారిద్దరిపై లైంగిక ఆరోపణలు ఉన్నాయని, శాప్ నిధులు రూ.7.12 లక్షలు దుర్వినియోగం చేశారని, నకిలీ క్రీడా సర్టిఫికెట్‌లు మంజూరు చేశారని నివేదికలో పేర్కొంది. దుర్వినియోగం చేసిన నగదును పెనాల్టీతో సహా వసూలు చేయాలని, నకిలీ సర్టిఫికెట్ ద్వారా పోస్ట్‌మాస్టర్ ఉద్యోగం పొందిన వి.సత్యనారాయణను ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించింది. వీరి గుర్తింపు రద్దు చేయాలని అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏకేఎఫ్ఐ) అడ్మినిస్ట్రేషన్‌కు సైతం ప్రభుత్వం సూచించింది. వీరి స్థానంలో జి.వెంకటరెడ్డి, వై.శ్రీకాంత్ అధ్యక్షకార్యదర్శులుగా కొనసాగుతున్న సంఘాన్ని గుర్తించాలని శాప్‌ను ఆదేశించింది. అయితే ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో వెంకటరెడ్డి స్థానంలో ప్రభావతిని అధ్యక్షురాలిగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు.

## 60 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 60 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 60 మందిపై 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గురువారం 60 మందిని ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 12 మందికి ఒక్కొక్కరికి 15వేలు చొప్పున రూ.1,80,000, మిగిలిన 48మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున రూ.4,80,000 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

### డ్రైయినేజీ మురుగు మళ్లింపు



సాక్షి ఎఫెక్ట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్‌లో టాయిలెట్స్ నుంచి బయటకు వస్తున్న మురుగు నదీ జలాల్లో కలవకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 1వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన స్నానఘాట్లలోకి డ్రైయినేజీ మురుగు కథనానికి ఆలయ ఈవో శీనానాయక్ స్పందించారు. స్నానఘాట్ల పరిస్థితిపై సమీక్ష సమావేశం నిర్వహించి వెంటనే మురుగు నదీలో కలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు హుటాహుటిన టాయిలెట్స్ నుంచి బయటకు వస్తున్న మురుగు నది జలాల్లో కలవకుండా దారి మళ్లించారు. టాయిలెట్స్ బయట నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టారు. స్నానఘాట్‌లో మెట్లపై పేరుకుపోయిన మట్టి, డ్రైయినేజీ వ్యర్థాలను తొలగింపు పనులు చేపట్టారు. మరో నాలుగు రోజుల్లో స్నానఘాట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### లయన్స్‌క్లబ్ విజయవాడ ఇమేజ్ నూతన కమిటీ ఎన్నిక

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఇమేజ్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ కార్యదర్శి టి.జయశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి క్లబ్ అధ్యక్షులుగా నందిగామ పద్మజ, సెక్రటరీ ఎస్‌సీఎస్ శ్రీనివాసాచార్యులు, ట్రెజరర్‌గా సీహెచ్ శారదతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వచ్చే నెల 11వ తేదీన నూతన కమిటీ సభ్యుల ప్రమాణాస్వీకర కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 57వ డివిజన్ న్యూఆర్ ఆర్‌పేటలోని కేజీఎఫ్ అపార్ట్‌మెంట్‌ల వెనుక భాగంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. వారు నిఘా పెట్టి తనిఖీలు చేయగా పసుపులేటి భాను, తమ్మిన నాగదుర్గారావు అలియాస్ నిఖిల్ అనే ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా వారి వద్ద రెండు కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. న్యాయస్థానం ఎదుట వారిని హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించింది.

# మొక్కలు నాటి సంరక్షించుకోవాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): మొక్కలు నాటి సంరక్షించుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సర్కిల్-3 పరిధిలోని లయోల కళాశాల వద్ద పర్యావరణ రక్షణపై కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 27 కిలోమీటర్ల వరకు ఎవెన్యూ ప్లాంటేషన్ ఉందని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీటిని పెంచి నగరంలో 10,160 మొక్కలను నాటి ఎవెన్యూ ప్లాంటేషన్‌ను 55 కిలోమీటర్ల వరకు పొడిగించబోతున్నామన్నారు. చెట్ల నుంచి వచ్చే ఆక్సిజన్ ఎంతగానో మేలు చేస్తుందని మనం విడిచే కార్బన్‌డయాక్సైడ్ను అవి పీల్చి కాలుష్యాన్ని తగ్గిస్తాయని తెలిపారు. నగర పరిధిలో ప్రతి నియోజకవర్గంలో ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించడమే కాకుండా 'ఫ్యాబ్రిక్ ఇన్- ప్లాస్టిక్ అవుట్' స్టాల్స్ ని ఏర్పాటు చేశారన్నారు. దుర్గ గుడి, పూల మార్కెట్, కాళేశ్వరరావు మార్కెట్, వీఎంసీ ప్రధాన కార్యాలయం, కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్, సాంబమూర్తి రోడ్ రైతు బజార్, పటమట రైతుబజార్ వద్ద ఈ స్టాల్స్ ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి ప్లాస్టిక్‌ని సేకరించి వారికి పర్యావరణహితమైన సంచులను పంచుతున్నామని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో హెచ్‌బి కాలనీ కరెంట్ ఆఫీస్, సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం చెరువు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకట్ నారాయణ, జోనల్ కమిషనర్ కె.షమీ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



విశేష అలంకరణలో వీరాంజనేయ స్వామి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం విజయదుర్గా రామలింగేశ్వర స్వామికి, పంచముఖ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున స్వామి వార్లకు అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజా కార్యక్రమాలను జరిపారు.

**విశేష పూజలు..**

అనంతరం ఆలయ ప్రాంగణంలో సువర్చల సమేత శ్రీ వీరాంజనేయ స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉభయదాతలు తమ్మిన సతీష్, శ్రీవాణి దంపతులచే కల్యాణం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు, పలువురు పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే సుజనాచౌదరి కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, చింతలపూడి సత్యనారాయణ, తిరుమలనాథుని కిరణ్‌కుమార్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందచేశారు. అనంతరం స్వామి వారి అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్, కార్యదర్శి పవన్‌కుమార్ శర్మ, కోశాధికారి జాగు బాబూరావు పర్యవేక్షణలో ఉత్సవాల ఏర్పాట్లు చేశారు.

# పని గంటల పెంపు దుర్మార్గం

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



బీసెంట్ రోడ్డులో ధర్నా చేస్తున్న సీఐటీయూ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్మికుల పనిగంటలు పెంపు నిర్ణయం అత్యంత దుర్మార్గమని, కూటమి.. కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని సీఐటీయూ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పనిగంటలు పెంచడాన్ని నిరసిస్తూ బీసెంట్ రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దోనేపూడి.కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనికోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమని ధ్వజమెత్తారు. కనీస వేతనాలు పెంచడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా లేదని, పనిగంటలు పెంచేందుకు మాత్రం అత్యుత్సాహం చూపిందన్నారు. తక్షణం లేబర్ కోడ్స్‌ను, దాని అనుబంధ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెలో కార్మికవర్గం పాల్గొనాలన్నారు.రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గారావు, నారాయణ, జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, ఎం.బాబురావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు .

# నగరంలో మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దుర్గాభవానీ, దుర్గాంబ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, తద్వారా మనతోపాటు భావి తరాల భవిష్యత్‌కుకూడా భరోసా కల్పిస్తోందని మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స దుర్గాభవానీ, నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర సమితి ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో లేదా పరిసరాలలో మొక్కను నాటి సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యకరమైన జీవితానికి పచ్చటి వాతావరణం దోహదపడుతుందన్నారు. అవసరానికి మించి ప్లాస్టిక్ వాడటం వలన మనుషులతోపాటు మూగజీవాలకు ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, నాయకులు రమణమ్మ, చింతాడ పార్వతి, నీలాపు భాగ్యలక్ష్మి, ఆర్ ఉమ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న డీఈవో యూవీ సుబ్బారావు, అధికారులు



50వ డివిజన్‌లో మొక్క నాటుతున్న కార్పొరేటర్ సత్యబాబు



హరిత బెరంపార్క్‌లో మొక్క నాటుతున్న కృష్ణచైతన్య, శ్రీనివాస్, సిబ్బంది



భవానీ ద్వీపంలో మొక్క నాటుతున్న సుధీర్, కొండయ్య



మొక్క నాటుతున్న కార్పొరేటర్ రెహమతున్నీసా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని చిట్టా అమర్‌సుధీర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రతినభూనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.పతంజలిశాస్త్రి తదితరులు మొక్కలు నాటారు.

**పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ**

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పచ్చదనం విస్తృతమైనప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎన్టీఆర్ జిల్లా డీఈవో యువీ సుబ్బారావు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఈవో కార్యాలయం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మానవ అవసరాలు విస్తృతమవుతున్న నేపథ్యంలో కాలుష్యం సైతం అధికమవుతుందన్నారు. దీంతో జీవజాలం మనుగడ ప్రమాదంలో పడే అవకాశముందని చెప్పారు. ఇప్పటికే కాలుష్యం కారణంగా అనేక పరిణామాలను చవిచూస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా వాటిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..**

వించిపేట(విజయవాడపశ్చిమ): పర్యావరణానికి ముప్పు కలిగించే చర్యలను మానుకుని వాటి పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరపాలకసంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలసి ఆయన 50వ డివిజన్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

**వేడుకగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలో గురువారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమం వేడుకగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్ ఆవరణలో సంస్థ విజయవాడ డివిజనల్ మేనేజర్ పీ కృష్ణచైతన్య, బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. భవానీ ఐలాండ్ మేనేజర్ డీ సుధీర్ ద్వీపంలో మొక్కలు నాటారు. ద్వీపానికి వచ్చే పర్యాటకులు మెచ్చే విధంగా ఆతిథ్య సేవలు అందించటంతో పాటు పర్యావరణాన్ని కాపాడుతున్నామన్నారు. కాంట్రాక్టర్ మన్నం కొండయ్య, ఐలాండ్ సిబ్బంది పాల్గొన్నారు.

**మొక్కలను ప్రాణప్రదంగా చూసుకోవాలి**

జీవకోటికి ప్రాణవాయువును అందించే మొక్కలను ప్రాణపదంగా చూసుకోవాలని 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అన్నారు. 119వ సచివాలయం పరిధిలోని అబ్దుల్ అజీమ్ వీధిలో ఆమె మొక్కలు నాటారు. ఇంటికో మొక్క నాటుతామని, పచ్చదనం పెంపునకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ సోమశేఖరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, సచివాలయం, మున్సిపల్ సిబ్బంది, నాయకులు ఎస్‌కే హయాత్ షరీఫ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఘాట్‌రోడ్డులో వనం-మనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఘాట్‌రోడ్డులో దేవస్థానం గురువారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఘాట్‌రోడ్డుతో పాటు అమ్మవారి ఆలయం సమీపంలోని తులసీవనంలో ఆలయ ఈవో శీనానాయక్ మొక్కలు నాటారు. ఈ వర్షాకాలంలో ఆలయ ప్రాంగణంలో ఔషధ మొక్కలు, దేవతా వృక్ష మొక్కలు, నక్షత్ర, రాశులకు చెందిన మొక్కలను నాటే కార్యక్రమం మొదలైందన్నారు. ఆలయ ప్రాంగణం శోభాయమానంగా, ఆహ్లాదకరంగా కనిపించేలా రంగురంగుల పూల మొక్కలను ఏర్పాటు చేయనున్నామన్నారు. మహా మండపం, గోశాల, అర్జున వీధులలో కేబీఎన్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శీనానాయక్ పాల్గొని విద్యార్థులతో కలిసి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ, ఆఫీసర్ డి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ నిర్మించండి



సత్యంగారి హోటల్ జంక్షన్‌ను పరిశీలిస్తున్న అంజిబాబు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని జాతీయ రహదారిపై సత్యంగారి హోటల్ జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ నిర్మించాలని రోడ్ సేఫ్టీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక ప్రజలతో కలిసి జంక్షన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ప్రమాదాల పేరుతో గత కొన్ని రోజులుగా జంక్షన్‌ను బారికేడ్లతో మూసివేయడంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారంగా అండర్ పాస్ నిర్మించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.